సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మిక చైతన్య యాత్రను జయప్రదం చేయండి

- కార్మికులకు సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జనవరి 2,3,4 తేదీలలో భీమవరంలో జరుగు సిఐటియు రాష్ట్ర మహాసభల జయప్రదానికి హిందూపురం నుండి బయలుదేరిన కార్మిక చైతన్య యాత్ర ఈనెల 30న శుక్రవారం 9 గంటలకు కర్నూలు నగరానికి వస్తున్న సందర్భంగా కార్మికులందరూ ఈ జాతాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. ఈమేరకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.నరసింహులు, సిహెచ్.సాయిబాబా, ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప కార్మికులను గురువారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్లులకు వ్యతిరేకంగా ఏప్రిల్ నెలలో ఢిల్లీలో కార్మిక కర్షక రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ హిందూపురం నుండి భీమవరం వరకు కొనసాగే కార్మిక చైతన్య యాత్ర కర్నూలు నగరానికి వస్తుందన్నారు. 30న ఉదయం 9 గంటలకు చేరుకుంటున్న సందర్భంగా నంద్యాల చెక్‌పోస్టు నుండి బైక్ ర్యాలీ సుందరయ్య సర్కిల్ వరకు నిర్వహించి సుందరయ్య సర్కిల్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలలో కార్మిక వర్గంపై ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ. 26,000 ఇవ్వాలని బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈ పోరాటంలో కార్మిక వర్గం భాగస్వామ్యం కావాలని కోరారు.

2022 సాగిందిలా...

- నూతన జిల్లాలతో మారిన స్వరూపాలు - వర్షాలు, నకిలీ విత్తనాలతో రైతన్నలకు నష్టాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2022 ఏడాది మరికొన్ని గంటల్లో ముగిసిపోనుంది. సంవత్సరం ప్రారంభమైన నాలుగో నెల నుంచే రెండో దశ కరోనా విజృంభించింది. అధిక వర్షాలు, వర్షాభావంతో పాటు నకిలీ విత్తనాలతో రైతన్నలు నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాల విభజనతో జిల్లా స్వరూపాలు మారాయి. ఈ ఏడాది ఎలా ముగిసిందో ఓ లుక్కేద్దాం రండి.....

కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ (ఫైల్)

కొత్త రూపం..

కర్నూలు జిల్లా కొత్త రూపంలోకి మారింది. ఏప్రిల్ 4న కర్నూలు జిల్లా రెండు ముక్కలు అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 మండలాలు ఉండగా కొత్తగా కర్నూలు, నంద్యాల అంటూ రెండు జిల్లాలుగా విభజించారు. 26 మండలాలతో కర్నూలు జిల్లాను 29 మండలాలతో నంద్యాల జిల్లాను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో గతంలో ఉన్న కర్నూలు, ఆదోని రెవెన్యూ డివిజన్లతో పాటు పత్తికొండను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు డివిజన్ పరిధిలో 8 మండలాలు, ఆదోని డివిజన్‌లో 9 మండలాలు, పత్తికొండ డివిజన్‌లో 9 మండలాలు ఉన్నాయి. కర్నూలు కలెక్టర్‌గా పి.కోటేశ్వరరావు, ఎస్‌పిగా సిహెచ్.సుధీర్ కుమార్ రెడ్డిని నియమించారు. తరువాత ఎస్‌పి బదిలీ కావడంతో సిద్ధార్థ్ కౌశల్ ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు.

ముంచిన నకిలీలు : గతేడాది లాగా ఈ ఏడాది కూడా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. గతేడాది అత్యధికంగా క్వింటా పత్తి రూ.12,500 వరకూ పలికింది. దీంతో, ఈ ఏడాది పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా సాధారణ సాగుకు మించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. నకిలీ పత్తి విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు పలు దఫాలుగా ఆందోళనలు నిర్వహించారు.

నష్టాల 'మాండూస్' : ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని రైతులను ఈ ఏడాది మాండూస్ తుపాను వణించింది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటంతో పంటలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడటంతో తడిసి ముద్దయింది. జిల్లాలో 6,74,864 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తైంది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధమవుతున్న సమయంలో వర్షం పడటంతో తడిసి పనికిరాకుండా పోతోంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోయింది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల చేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

అధిక వర్షాలతో నీట మునిగిన పంట (ఫైల్)

'హంద్రీ' రైతుల ఆందోళన : హంద్రీనీవా కింద రైతులు వేసిన పంటలకు మార్చి నెల చివరి వరకు ఇస్తామని తొలుత చెప్పిన అధికారులు ప్రస్తుతం జనవరి వరకే ఇస్తామని చెబుతున్నారు. హంద్రీనీవా కింద ఉమ్మడి జిల్లాలో 40 వేల ఎకరాల్లో రబీలో పంట వేశారు ఇప్పుడు హంద్రీనీవా అధికారులు మార్చి చివరి వరకు సాగునీరు అందించలేమని చెప్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో అధిక వర్షాలు రావడం, తెగుళ్లు రావడం, నకిలీ విత్తనాల వల్ల వేసిన పంటలు చేతికి రాక అప్పులతో విలవిలలాడుతున్న రైతులకు రబీలో అయినా పంటలు సాగు చేసుకునేందుకు అధికారులు అవకాశం లేకుండా చేశారు.

టమోటా రైతు విలవిల : టమోటా ధర రోజురోజుకూ పడిపోతుండడంతో సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెల రోజుల క్రితం ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ధర పడిపోవడంతో రైతులు దిగులు పడ్డారు. బాక్సు (25 కిలోలు) ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కోత కూలిలు, రవాణ ఖర్చులు, కమీషన్ పోను రైతుకు ఏమాత్రం మిగలకపోవడంతో నష్టపోతున్నారు.

ఆగని బన్ని ఉత్సవం : బన్ని ఉత్సవంలో ఈ ఏడాది కూడా రక్తపాతం ఆగలేదు. హొళగుంద మండల పరిధిలోని శీ మాల మల్లేశ్వర జైత్రయాత్ర (బన్ని ఉత్సవం)లో భాగంగా ఈ ఏడాది కూడా కర్రల సమరం జోరుగా సాగింది. జైత్ర యాత్రలో పాల్గొన్న వారిలో రింగ్ కర్రలతో కొట్టుకోవడంతో పాటు అగ్ని దివిటీల ఆవిరి తగిలడంతో 86 మందికి గాయాలయ్యాయి. మరో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'పిన్నాపురం'పై నిర్బంధం : రెండు జిల్లాలకు మధ్యలో ఉండే ప్రాంతమది. ప్రధాన రహదారులకు దూరంగా ఎక్కడో కొండల గుట్టల మధ్య ఉన్న గ్రామమది. ఆ గ్రామస్థులు వారం రోజులుగా నిర్బంధానికి గురవుతున్నారు. ఊరి నుంచి వెళ్లకుండా, ఊరిలోకి ఎవరూ రాకుండా పోలీసులు పహారా కాశారు. అది పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామ ప్రజల పరిస్థితి. వారు చేసిన తప్పల్లా గ్రామంలో ప్రాజెక్టు పడితే ఊర్లో పది మందికి పని దొరుకుతుందని ఆలోచించడమే. పిన్నాపురం మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో ఎక్కడో మారుమూలన కొండ ప్రాంతాల్లో ఉంది. ఆ గ్రామంలో దాదాపు 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఓర్వకల్లు మండలం గుమ్మితం తండాతో పాటు పాణ్యం మండలంలోని పిన్నాపురం పరిసర భూములను సదరు కంపెనీ సేకరించింది. రైతులు సాగు చేసుకుంటున్న 2వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న 500 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు. ఏళ్ల కాలంగా సాగులో ఉన్నా సదరు రైతులు ఆ భూములకు హక్కుదారులు కాదనే కారణంతో వారికి పరిహారం ఇవ్వలేదు.

మార్కెట్‌లో టమోటాను విక్రయిస్తున్న రైతులు (ఫైల్)

పించన్ల నిలిపి వేత అన్యాయం

- పెన్షన్లు కొనసాగించకుంటే రోడ్లపై అడుక్కు తినడం లేదా ఆత్మహత్యేలే శరణ్యం
- పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వివిధ కారణాలతో వికలాంగుల, వితంతువుల, వృద్ధుల, ఒంటరి మహిళల పెన్షన్లు రద్దు చేస్తామనడం అన్యాయమని పట్టణపౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి అన్నారు. పెన్షన్లు కొనసాగించకపోతే రోడ్ల వెంట అడుక్కు తినడం లేదా ఆత్మహత్యే శరణ్యమంటూ నగరపాలక సంస్థ కార్యాలయం ముందు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎం.నాగరాజు, ఎస్. నౌషద్, పి.ఎక్బాల్ మాట్లాడుతూ కాళ్ళ, చేతులు, నోరు, కండ్లు లేనివారితో పాటు మానసిక వికలాంగులు, పైన, అవ్వ తాతలు, భర్తలను కోల్పోయిన వితంతులు, ఒంటరి మహిళల పైన జగన్ ప్రభుత్వం కక్షగట్టినట్లుగా కనిపిస్తుందని అన్నారు. గుణపాలను వదిలేసి గుండుసూది పట్టుకున్న చందంగా రూ.వందలవేల కోట్ల సంపన్నులను, ఇసుక, మద్యం మాఫియాలను వదిలేసి పెన్షన్లు రద్దు చేయడం అన్యాయమన్నారు. ఆందోళన అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి మాట్లాడుతూ సర్వే జరిపి అర్హులైన వారందరికీ పెన్షన్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మేనేజర్ చిన్న రాముడు ఉన్నారు. ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎ. వెంకటేశ్వర్లు, ఎన్.మద్దిలేటి, కె. శ్రీనివాసులు, సివి.వర్మ పాల్గొన్నారు.

నేడు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎపిఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ శుక్రవారం కర్నూలుకు రానున్నారు. ఎమ్మిగ్నూర్‌లో కొంతసేపు అధికారులతో సమావేశం అవుతారు. అనంతరం గోనెగండ్ల మండలంలోని అల్వాల గ్రామంలో ఇటీవల హత్యకాబడ్డ దళిత యువకుడు అమోస్ కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారు.

వృద్ధ మహిళ చెప్పే సమస్యను వింటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

జల మిషన్ పథకం ప్రారంభం

ప్రజాశక్తి- పత్తికొండ : పత్తికొండ మండల పరిధిలోని పెద్ద హుల్తి గ్రామంలో జలమిషన్ పథకం ద్వారా ఇంటింటికి నీటి సరఫరా అందిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వమే కార్యక్రమను గ్రామ సర్పంచి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జల మిషన్ పథకం ద్వారా 23 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నీటి సరఫరా పనులను ఆమె ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాలను ప్రజలకు అందజేసి వివరించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి గ్రామంలో స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సురేంద్ర వినతి పత్రాన్ని అందజేశారు. పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, వైసిపి నాయకులు నాగరాజు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, తహశీల్దార్ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

పేద విద్యార్థుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి కృషి చేసు_న్నారని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం వసంత నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదన్నదే సిఎం లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందు బాటులోకి తేవాలని ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేస్తుం దన్నారు. అంతకుముందు కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ , వైఎస్ ఎంపిపి నెహెమ్యా, జెడ్పిటిసి ప్రసన్నకుమార్ గొందిపర్ల సర్పంచి శ్రీనివాసులు,పాఠశాల సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం సంపత్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పై హత్య కేసు నమోదు చేయాలి

ప్రచార పిచ్చి వల్లే కందుకూరు ఘటన: బి.వై. రామయ్య

విలేకరుల సమావేవంలో మాట్లాడుతున బివై.రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై హత్య కేసు నమోదు చేయాలని, ప్రచార పిచ్చివల్లే కందుకూరులో 8 మంది ప్రాణాలు బలయ్యాయని వైసిపి జిల్లా అధ్యక్షులు, మేయర్ బివై. రామయ్య ఆరోపించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. జిల్లా అభివృద్ధిపై కోట్ల విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామన్నారు. బహిరంగ చర్చకు ఎక్కడైనా, ఎప్పుడైనా సిద్ధమేనని చెప్పారు. మూడున్నరేళ్లుగా జిడిపి వృద్ధి చెందింది కోట్లకు కనబడదా? కోట్ల తన స్థాయికి దిగజారి మాట్లాడటం తగదని చెప్పారు. సంక్షేమానికి కష్టకాలంలో కూడా బ్రేక్ వేయని జగన్‌పై అభాండాలా? అని ప్రశ్నించారు. చంద్రబాబు సభలకు జన స్పందన లేకపోవడంతో జనం ఎక్కువగా కనబడేందుకే, టిడిపి నేతలు ఇరుకైన ప్రదేశాలను ఎంపిక చేయడంతోనే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. దీనికి టిడిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రచార ఆర్భాటం కోసం ఎంతమంది ప్రాణాలైనా బలి చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. చంద్రబాబు అడుగు పెట్టక ముందే ఇంత వినాశనానికి కారణమైన టిడిపికి బుద్ధి చెప్పాలన్నారు. గోదావరి పుష్కరాల సంఘటన ద్వారా గతంలో అనేక మందిని పొట్టన పెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. మద్దయ్య, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నాయకులు కృష్ణచైతన్య, డిష్ అనిల్ కుమార్, బత్తుల లక్ష్మికాంతయ్య పాల్గొన్నారు.

కందుకూరు మృతులకు టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్యాండిల్స్ వెలిగించి నివాళ్లు అర్పిస్తున్న గౌరుదంపుతులు

ప్రకాశం జిల్లా కందుకూరు ఘటనలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు టిడిపి నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి పాణ్యం టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి క్యాండిల్ లైటింగ్ తో ఘన నివాళులు అర్పించారు. పాణ్యం నియోజకవర్గం ఇన్‌ఛార్జి గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల స్వగహం మాధవినగర్‌లో కందుకూరు ఘటనలో మృతి చెందిన టిడిపి కుటుంబ సభ్యుల మృతికి సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ కందుకూరు చంద్రబాబు పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకోవడం చాలా బాధా కరమన్నారు. మృతుల కుటుంబాలకు టిడిపి తరుపున చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ.15లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం, అంతే కాకుండా చనిపోయిన కుటుంబ సభ్యుల పిల్లల చదువు కోసం ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరుపున చదివిస్తామని హామీ ఇచ్చారన్నారు. పార్టీ రాష్ట ముఖ్య నాయకులు కూడా తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల ఇస్తామన్నారు. ఇరుకు సందుల్లో మీటింగ్ లు పెట్టడం వల్ల ఈ అపశ్రుతి జరిగిందని వైసిపి నాయకులు మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు. కందుకూరులో టిడిపి కార్యకర్తల మృతి బాధాకరమని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కందుకూరులో మృతి చెందిన పార్టీ కార్యకర్తలు నివాళ్లు అర్పించారు.

అందరి సహకారంతోనే గ్రంథాలయ అభివృద్ధి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగస్తుల అందరి సహాయ సహకారాలతో జిల్లా గ్రంథాలయాల్లో వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేశానని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మద్దూరు సుభాష్ చంద్రబోస్ గ్రంథాలయ అధ్యక్ష పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మద్దూరు సుభాష్ చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు.గ్రంథాలయ కార్యదర్శి కె.ప్రకాష్ అధ్యక్షత వహించారు. సుభాష్ చంద్రబోస్ బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రంథాలయాల కోసం చేపట్టిన కార్యక్రమాలలో జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం, గ్రంథాలయాలకు వచ్చి చదువుకునే నిరుద్యోగ యువతకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు, ఉన్నత లక్ష్యాల సాధన-

సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు జిల్లాలో చేపట్టే కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ఆదర్శంగా తీసుకున్నారని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.ప్రకాష్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వజ్రాల గోవిందరెడ్డి, డిప్యూటీ గ్రంథ పాలకురాలు పెద్దక్క, ఉపగ్రంథ పాలకులు బషీర్ అహ్మద్ , వెంకటేశ్వర్లు, తదితరులు ఆయన చేసిన సేవలను గురించి కొనియాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఉపగ్రంథ పాలకులు ఆయనను శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు.

1న జీతాలు చెల్లించాలి : కత్తి నరసిహారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలుకలెక్టరేట్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తినరసింమారెడ్డి

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,పెన్షనర్లకు ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సలాం ఖాన్ భవన్‌లో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాద్యాయులు పిఎఫ్ ,ఎపిజిఎల్‌ఐ లోన్లు, ఫైనల్ చెల్లింపులు, సరెండర్ లీవ్‌లు, డిఎ బకాయిలకు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. జీతాల కోసం కూడా రోడ్లెక్కే పరిస్థితి రావడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు ఒకటో తేదీని జీతాలు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. బదిలీలపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకొని అసంబద్ధమైన వాటిని తొలగించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావతం కాకుండా చేయాలన్నారు.

భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : తహసీల్దార్

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలో భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సంబందించిన సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయా గ్రామాల్లో చేపట్టిన సర్వేలను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సర్వేలతో భూమికి రక్షగా ప్రభుత్వం కొత్త పట్టాలను ఇస్తుందని, సర్వేలతో భూ సమస్యలకు తావుండరాదని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లపై క్యాండిల్స్‌తో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్ : చార్జీల రూపేనా స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని పేదల పైన భారం చేయవద్దని మీటర్ల పేరుతో దోపిగడీపై విచారణ చేయాలని క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు, టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి నరసింహనాయుడు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత, సిపిఎం నాయకులు, నరసింహ ఆచారి, ఏసు వెంకటేష్ సీతా రాముడు, జాకీర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుడూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఆరు నెలల్లో ఏర్పాటుకు పనులు ప్రారంభిస్తామని చెప్పడం వల్ల పేద ప్రజలపై మరో భారం వేయ డం బాధాకరమన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడి చేసే ప్రయత్నాలపై సమగ్ర విచారణ చేయాలన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో వేసిన భారాన్ని మరవక ముందే స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారాన్ని వేయడం ఏమిటని ప్రశ్నించారు. గృహ వాణిజ్య పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును ప్రజల నుంచే చార్జీల పేరుతో వసూలు చేయడం బాధాకరమన్నారు.

సాధించాలనే తపన ఉండాలి

- డిటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఆలూరు

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీనివాసరావు

జీవితంలో ఏదైనా సాధించాలనే తపన ప్రతి విద్యార్థికీ ఉండాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆలూరు గిరిజన బాలుర ఆశ్రమ, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ పి.జమ్మన్న అధ్యక్షతన విద్యార్థులపై ఉపాధ్యాయుల ధోరణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. పదో తరగతిలో వందశాతం ఉతీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి చదివిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విజయ సోపానం (ఎ స్టెప్ టు సక్సెస్) అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సబ్జెక్ట్ గురించి ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను అందజేసి గిరిజన విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు రాజేశ్వరి, రోజారమని, పెద్దయ్య, రవి, రాజేంద్ర, రంగబాబు, విజయకుమార్ ఉమా, శ్రీప్రియ, సుధాశాంతి, సరస్వతి, ఆదిలక్ష్మి, నాగేశ్వరరావు, శివ, పరమేష్, మల్లికార్జున, సూర్య ప్రకాష్, రాజేష్ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సారథులు

పార్టీ కోసం పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సారథులు వైసిపి కోసం పని చేయాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండల గ్రామ వాలంటీర్లు, కొత్తగా నియమితులైన జగనన్న సచివాలయం కన్వీనర్లు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలో ఎంపిక చేసిన వైసిపి కన్వీనర్లు పార్టీ కోసం పనిచేసే గృహ సారథులను ఎంపిక చేయాలన్నారు. వీరంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల కోసం పనిచేసి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మళ్లీ వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని తెలిపారు. ఎవరికీ భయపడకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికీ ముగ్గురు కన్వీనర్లను నియమించామని తెలిపారు. ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు గృహ సారథులను ఎంపిక చేసుకోవాల్సి ఉందని చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, ఎంపిపి కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్ అహ్మద్, ఐ ప్యాక్ టీం బృందం సభ్యులు చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

- నేమకల్లు సర్పంచి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

ట్యాబ్‌లను అందజేస్తున్న సర్పంచి ప్రేమ్ కుమార్

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థీ చదువుపై శ్రద్ధ వహించి, చదివితే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధిస్తారని సర్పంచి ప్రేమ్ కుమార్ సూచించారు. గురువారం నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అబ్రహం లింకన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు మంజూరు చేసిన ట్యాబ్‌లను సర్పంచి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే అవకాశం ఏర్పడిందన్నారు. విద్యా కమిటీ చైర్మన్ పూజారి అశోక్, వైసిపి నాయకులు గురుదాసు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : మండలంలోని నారాయణపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచి అల్లమ్మగారి సరళమ్మ, వైసిపి నాయకులు అల్లమ్మగారి పురుషోత్తం రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తెస్తున్నారని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ నీలమ్మ, ప్రధానోపాధ్యాయులు జానకి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచి సరళమ్మ

పాదయాత్రలో ఇచ్చిన హామీ ఏమైంది..?

- ట్రాన్స్‌కో కార్మిక, ఉద్యోగులను విస్మరించిన జగన్
- సిఐటియు జిల్లా నాయకులు గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విస్మరించారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు డి.గౌస్ దేశాయ్, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న మండిపడ్డారు. గురువారం ఆదోని సుందరయ్య భవన్‌లో డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థను నమ్ముకుని కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులు దాదాపు 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత రెగ్యులర్ లేకపోవడం వల్ల ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితి ఉందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్ విస్మరించారని విమర్శించారు. చాలీచాలని వేతనాలతో, భద్రత లేని ఉద్యోగాలు చేస్తూ కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాము కూడా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు పెరిగి కుటుంబానికి అండగా ఉంటామన్న ఆశ ఆశగానే మిగిలిపోయిందన్నారు. 'మాట తప్పను. మడమ తిప్పన'ని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవహారంలో మడమ తిప్పారని విమర్శించారు. చేతుల్లో చూపించే ముఖ్యమంత్రి కాదని తేలిపోయిందన్నారు. ఇంతవరకు ఏ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసినా దాఖలాలు లేవని మండిపడ్డారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జావిద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కె.భీమేష్ చౌదరి, కోశాధికారిగా షేక్షావలీ, ఉపాధ్యక్షులుగా బసవరాజు, అధ్యక్షులుగా బసవన్న గౌడ్‌తో పాటు 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు భద్రత, పరికరాలు, ఇఎస్ఐ, ఇపిఎఫ్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాడతామని కమిటీ తీర్మానించింది. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) డివిజన్ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలి

- సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలో తొలగించిన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సిపిఎం మండల కార్యదర్శి పి.హనుమంతు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల పేరుతో పేదల పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. భూమి ఎక్కువ ఉందని, విద్యుత్ బిల్లు ఎక్కువ వస్తుందని, వంద గజాల స్థలంలో ఇల్లు ఉందని లేనిపోని షరతులు పెట్టడం సమంజసం కాదన్నారు. మండలంలో 500 పింఛన్లు తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆలోచన మార్చుకోకపోతే పింఛనుదారులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు నరసింహులు, వెంకటేష్, పెద్ద వీరభద్ర, వెంకటేష్, వీరేష్, వీరేష్, వీరభద్ర, మారెప్ప పాల్గొన్నారు.

ఆస్పరిలో ధర్నా చేపడుతున్న నాయకులు

ఎమ్మిగనూరు : వైఎస్ఆర్ సామాజిక పింఛన్లు, వృద్ధులకు, వితంతు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్లను యథావిధిగా కొనసాగించాలని, తెల్ల కార్డు ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలను కొనసాగించాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు, రాజు కోరారు. వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్లు, పథకాలు తొలగించాలని చూస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే సంక్షేమ పథకాలు, పింఛన్లలో కోతలు పెడుతున్నారని చెప్పారు. బాధితులు ప్రభుత్వంపై ఆందోళనలకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులూ లేకుండా అన్ని పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు ఎ.రాజు, విజయ్, ఎంకన్న, ఎ.సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

కన్వీనర్లు, వాలంటీర్లు

బాధ్యతగా పని చేయాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-ఆలూరు

నియోజకవర్గంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. గురువారం వైసిపి క్యాంపు కార్యాలయంలో రెండోరోజు ఆలూరు, ఆస్పరి, దేవనకొండ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గానికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల్లో రూ.1050 కోట్లు అందాయని తెలిపారు. రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆలూరు సీటు గెలిచి, ముఖ్యమంత్రి జగనన్నకు బహుమతిగా అందించాలని కోరారు. మంత్రి సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు పూర్తి

- ఆదాయం రూ.3,30,20,636

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో హుండీ లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. 34 రోజుల హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు, శ్రీమఠం అధికారులు, సేవాదారుల సమక్షంలో లెక్కించగా రూ.3,30,20,636 నగదు రూపంలో రాగా బంగారం 0.095 గ్రాములు, వెండి కిలో 300 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కార్యదర్శి రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక జడ్‌పిహెచ్ పాఠశాల ముందు ఎస్‌ఎఫ్‌ఐ జెండాను మాజీ నాయకులు మల్లేష్, చంద్రశేఖర్, నరేష్ ఆచారి ఆవిష్కరించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లక్ష్మీకాంత్, మహేంద్ర, వీరేష్, రాము, నాగేష్, హరి, అరవింద్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

M.V.O.P No. 330/2019

బోయ.నరసింహులు. ...అర్జీదారు

-Vs-

S.మహబూబ్ బాషా వగైరా. ...రెస్పాండెంట్లు

1వ రెస్పాండెంటుకు నోటీసులు

1.S. మహబూబ్ బాషా తండ్రి లేట్ అబ్దుల్ రహిమాన్, డ్రైవరు ఇంటి నెం. 1-27, కొండపేట, పత్తికొండ గ్రామం & (మం), కర్నూలు జిల్లా .

పై నంబరు M.V.O.P లో అర్జీదారు తనకు రోడ్డు ప్రమాదములో జిరిగిన గాయములకు నష్టపరిహారం రూ.1,00,000/- లు, ఇందుపైన ప్రమాదం జరిగిన రోజు నుండి 18% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 31-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 31-1-2023

C.V. శ్రీనివాసులు,
అర్జీదారు పరం న్యాయవాది,
కర్నూలు.

గ్రామాలాభివృద్ధికే ప్రాధాన్యత

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామాల అభివృద్ధికి వైసిపి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డితో కలిసి రెండో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్‌ను అందజేసి పథకాలను చదివి వినిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. మరి కొన్ని చోట్ల సిసి రోడ్లు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామంలోని పలువురు నాయకులు ఎమ్మెల్యేకు, యువ నేతకు శాలువా కప్పి గజమాల వేసి సన్మానించారు. అనంతరం గ్రామంలోని గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించారు. వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ కిరణ్ బాబు, మాజీ వైస్ ఎంపిపి వెంకోబ, నాయకులు కోసిగి హనుమంతు, రోగప్ప, బొజ్జప్ప, రవి రెడ్డి, రాము, నరసింహులు, ఆర్‌కె.ఈరన్న, డీలర్ నాగేష్, డీలర్ బొజ్జప్ప, పెద్దయ్య, మజ్జిగ శ్రీనివాసులు, కోసిగి నారాయణ, నేమలికల్లు ఉరుకుందు, మజ్జిగ భీమా, వర ప్రసాద్, దుబ్బన్న, శంకరప్ప, రాజు, పోలి నరసప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పూలమాల వేస్తున్న నాయకులు

మెరుగైన వైద్య సేవలందించి గుర్తింపు పొందాలి

అవసరమైన ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలందించి గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోరారు. మండలంలోని రాంపురం గ్రామంలో 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, వైద్యులు భావన, ఇందు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి అవసరమైన వారికి వైద్య సేవలు అందించాలని సూచించారు. రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన 104 ద్వారా అవసరమైన వారందరూ వైద్య సేవలు పొందాలని గ్రామస్తులకు సూచించారు. వైసిపి మండల నాయకులు పెట్రోలు బంక్ శీను ఉన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A. No. 892/2017 in

I.A. No. 990/2016 in O.S. No. 684/2020

S.వెంకటేశ్వర్లు
...వాది/అర్జీదారు

-Vs-

S.వెంకటరాముడు పోతివారసులు వగైరా
...ప్రతివాదులు/ రెస్పాండెంట్లు

1,2 రెస్పాండెంట్లకు నోటీసులు

(ఆర్డర్ 22 రూలు 1,2, & 4 C.P.C మరియు రూలు 28 & 29 సివిల్ రూల్స్ ప్రకారం)

1.S. మహేంద్రమణి భర్త S.మల్లికార్జున
2. S.T. వెంకటసాయి తండ్రి లేట్ S.మల్లికార్జున, ఇద్దరు డోర్ నెం. 65/83-C, కోట కర్నూలు.

పై నంబరు దావాలో 4వ ప్రతివాది అయిన S.మల్లికార్జున తండ్రి S.C. లక్ష్మయ్య చనిపోయినందున అతనికి పై కనపరచిన 1,2 రెస్పాండెంట్లు వారసులుగా చేర్చమని అర్జీదారు అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 07-02-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందు మూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 07-02-2023

M.వెంకోబ రావు,
M.శివరామ చంద్ర రావు,
వాది/అర్జీదారు పరం న్యాయవాదులు,
కర్నూలు.

సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

అధికార పార్టీ ఏజెంట్‌గా మున్సిపల్ కమిషనర్

- చలానా కట్టి ఏర్పాటు చేసుకున్న కటౌట్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ వైసిపి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు, బీవీ.జయ నాగేశ్వర రెడ్డి కటౌట్‌ను తొలగించి టిడిపి కార్యకర్తలు, ప్రజల మనోభావాలను దెబ్బతీశారని తెలిపారు. గురువారం కటౌట్ తొలగింపును నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కలీముల్లా, రంగస్వామి గౌడ్, రాందాస్ గౌడ్, కటారి రాజేంద్ర, మధు బాబు, దయాసాగర్, సుందర్‌రాజు మాట్లాడారు. జాతర సందర్భంగా టిడిపి నాయకులు సోమేశ్వర టాకీస్ దగ్గర ఏర్పాటు చేసిన కటౌట్‌ను మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

సిసి కెమెరాల సంఖ్య పెంచాలి

- ట్రేడర్స్, కమీషన్ ఏజెంట్ల వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్యూరిటీని, సిసి కెమెరాలు సంఖ్య పెంచాలని ట్రేడర్స్, కమీషన్ ఏజెంట్లు కోరారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ ఉమాపతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో గోడౌన్ నెంబర్ 1, 2, 3లో దొంగలు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. మూడు నెలల క్రితం కూడా దొంగతనం జరిగిందని, అప్పుడూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని చెప్పారు. బుధవారం అర్ధరాత్రి అబ్దుల్ గఫూర్ అండ్ సన్స్, ముగతి నరసింహులు, యుఎం.యాకోబు, ముగతి నరసయ్య గోడౌన్లలో దొంగతనం చేసిన వారిని పట్టుకోవాలని కోరారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రేడర్స్ అసోసియేషన్స్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఉరుకుందయ్య శెట్టి, యుఎం.నరసింహులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఆస్పత్రి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మురికివాడలో నివసించే పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోనిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రాయ నగర్ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన అర్బన్ హెల్త్ ఆస్పత్రులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా పేదలందరికీ కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందని తెలిపారు. ఆదోనిలో మెరుగైన వైద్యం అందించేందుకు ఆరు ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో ప్రాథమిక వైద్యంతో పాటు ప్రసవాలు కూడా జరిగేలా వైద్యులు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. రెండో తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఈ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డి, ఇంజినీర్లు నాగభూషణం రెడ్డి, రాజు నాయక్, కృపాకర్, నాయకులు కామాక్షి తిమ్మప్ప, రామలింగేశ్వర్ యాదవ్, బాలాజీ, కిషోర్, వికె.వెంకటేష్, పరిగల నారాయణ, కాంట్రాక్టర్ జైపాల్ ఉన్నారు.

పథకాలతో పేదవాడి ముఖంపై చిరునవ్వు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలతో ప్రతి పేదవాడి ముఖంపై చిరునవ్వు కనిపిస్తోందని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని రాయనగర్, పైకొట్టాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 2024లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, జమీల్ షఫీ, కామాక్షి తిమ్మప్ప, మహేష్, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఈరన్న పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం : టిఎన్‌ఎస్‌ఎఫ్

ప్రజాశక్తి-ఆలూరు

జిల్లా కమిటీ పిలుపు మేరకు టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలు కళాశాలలు, పాఠశాలల బంద్‌ను విజయవంతం చేసినట్లు టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు టి.సిద్ధప్ప, మనోహర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న విద్యా వ్యతిరేక నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు. జిఒ 77ను రద్దు చేసి పిజి విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని తెలిపారు. ఎయిడెడ్ విద్యావ్యవస్థను పునరుద్ధరించి పేదలకు ఉచిత విద్యనందించాలని కోరారు. నాయకులు వివేక్, హాయజ్, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు. **దేవనకొండ**లో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయ బాల రంగడు, నవీన్, బాల తేజ తెలిపారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ శాఖ ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సుధాకర్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆదోని విద్యుత్ భవన్‌లో ఆయన ఛాంబర్‌లో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సుధాకర్ కుమార్ మాట్లాడారు. సకాలంలో విద్యుత్ బిల్లులు, మొండి బకాయిలు వసూలు చేయించి సంస్థ పురోగాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కౌతాళం ఎఇ నర్సన్న, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డివిజన్ సెక్రటరీ వీర రాజు, ఆస్పరి అసిస్టెంట్ ఇంజినీర్ మల్లికార్జున, ఎఇ రాజు, ఉద్యోగులు ఉన్నారు.

వైసిపిపై పెరుగుతున్న వ్యతిరేకత

- మృతుల కుటుంబాలకు టిడిపి అండ
- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. గురువారం ఆదోనిలోని టిడిపి కార్యాలయంలో కందుకూరు మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడ రోడ్డు షో నిర్వహించినా ప్రజలు తండోపతండాలుగా స్వచ్ఛందంగా వస్తున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరులో బుధవారం నిర్వహించిన రోడ్డు షోకు అశేష జనవాహిని హాజరయ్యారు కావడం చారిత్రాత్మకమని చెప్పారు. అలాంటి కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుని 8 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు టిడిపి అండగా నిలిచిందన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు, స్థానిక నాయకులు మరో రూ.4 లక్షలు పరిహారం ప్రకటించారని తెలిపారు. మృతుల కుటుంబాల్లో చదువుకునే వారికి ఎన్‌టిఆర్ ట్రస్టు విద్యాలయాల్లో ఉచితంగా విద్య అందించే బాధ్యత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. నాయకులు బుద్ధారెడ్డి, రంగస్వామి, నాయుడు, అల్తాఫ్ హుస్సేన్, శేషిరెడ్డి, అయ్యన్న, వాల్మీకి వెంకటేశులు, లక్ష్మన్న, బసవ, సయ్యదుల్లా, రాయనగర్ శంకర్, మాంత్రికి గిడ్డయ్య, వీరేష్, లక్ష్మీనారాయణ, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు రవి, సుబ్బు, వీరేష్ ఉన్నారు. అలాగే నెల్లూరు జిల్లా కందుకూరు మృతులకు ఆదోని టిడిపి కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, మైనార్టీ నాయకులు సౌది రావుఫ్, సాంబగల్ ఫక్రుద్దీన్, గుడిసె శ్రీరాములు, రామచంద్ర, మురళీ, సోమశేఖర్ రెడ్డి, విఎం.గోపాల్, వాల్మీకి మల్లేష్ ఉన్నారు. **ఎమ్మిగనూరు**లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతి చెందిన, గాయపడిన టిడిపి కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని తెలిపారు. ఇక ముందు జరిగే సభలకు హాజరయ్యే ముందు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. **దేవనకొండ** టిడిపి కార్యాలయంలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పించారు. టిడిపి మండల నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, ఆకుల వీరేష్, మల్లయ్య, మల్లికార్జున గౌడ్, వెంకటస్వామి గౌడ్, బండ్లయ్య, నాగేశ్వరరావు, రాజగోపాల్ గౌడ్, పొట్లపాడు వెంకటేష్, రామాంజిని, గౌడ్ పాల్గొన్నారు.

ఆదోనిలో మృతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నివాళులర్పిస్తున్న భాస్కర్ రెడ్డి వర్గం నాయకులు

దేవనకొండలో...

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. NO. 772/ 2021

C.ఖలీల్ అహ్మద్ @ S.ఖలీల్ అహ్మద్. ...వాది

-Vs-

అరబ్ షేక్ జానీ వగైరా. ...ప్రతివాదులు

3 నుండి 5 ప్రతివాదులకు దావా సమన్సు

3.అరబ్ మహమ్మద్ షేక్ అహ్మద్ తండ్రి అరబ్ మహమ్మద్ ఇసాక్,వ్యాపారం, ఇంటి నెం.61/ 338 A, అన్వర్ మంజిల్, కొత్తపేట, కర్నూలు.
4.A.కవిత తండ్రి A.దేవజ్ఞానం, ఇంటి నెం. 40/ 447 -16A, కర్నూలు. 5.P.వెంకట రామిరెడ్డి తండ్రి P.పెద్ద నాగిడ్డి, ఇంటి నెం.45/ 23 -135, అశోక్ నగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది పేర 4వ ప్రతివాది వ్రాయించి ఇచ్చిన విక్రయదస్తావేజు రద్దు పరచమని మరియు 4వ ప్రతివాది 5వ ప్రతివాది పేర వ్రాసి ఇచ్చిన, 5వ ప్రతివాది 3వ ప్రతివాది పేర వ్రాసి ఇచ్చిన, 5వ ప్రతివాది 2వ ప్రతివాది పేర మరియు 5వ ప్రతివాది 1వ ప్రతివాది పేర వ్రాసి ఇచ్చిన దావా షెడ్యూలు తాలుకు దాస్తావేజులను రద్దు కోరుతూ ఈ విషయమును కర్నూలు సబ్ -రిజిస్ట్రార్ వారికి తెలియజేయమని 2. ప్రతివాదులు గానీ వారి తరపున మనుషులు గానీ ప్లేయింట్ షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రవేశించకుండా పర్మినెంట్ ఇంజంక్షన్ కోరుతూ మరియు దావా ఖర్చులు ఇప్పించమని వాది దావా దాఖలు చేసినాడు. ఇందులో 3 నుండి 5, ప్రతివాదులైన అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 2-2-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 2-2-2023

C.లోకేశ్వరయ్య,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

హక్కుల సాధనకు సమరశీల పోరాటం

విఏఎల రాష్ట్ర 4వ మహాసభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

ఉద్యోగ భద్రత, కనీస వేతనం, నిర్థిష్ట పనిగంటల సాధనకు విఏఎలు సమరశీల ఐక్యపోరాటాలు నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిర్బంధాలు ఎదుర్కొని పోరాడకపోతే హక్కులు, సదుపాయాలు సాధించుకోవడం సాధ్యం కాదన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఎపి వెలుగు విఏఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని గవరపాలెం బి రాంబాబు ప్రాంగణంలోని వి రత్నంనగర్ (వివి రమణ రైతు భారతి కల్యాణ వేదిక)లో గురువారం ప్రారంభమైంది. యూనియన్ జెండాను సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపావతి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేవారిపై ప్రభుత్వాలు నిర్బంధ చర్యలకు దిగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.ఎనిమిది వేల వేతనంతో విఏఎలు ఎలా బతుకుతారో ప్రభుత్వం ఆలోచించకపోవడం అన్యాయమన్నారు.

మోడీ, జగన్ ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు, సేవా రంగాలు, ఆర్థిక సంస్థలను గుండుగుత్తగా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు మారుస్తున్నాయన్నారు. కార్మిక చట్టాల్లేకపోతే కార్మికులకు రక్షణ ఉండదని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మహాసభలో కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ విఏఎల సమస్యలపై చేసిన పోరాటాలు, అనుభవాలు, సాధించిన విజయాలు వివరించారు. సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ 64 రద్దయ్యే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. విఏఎలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటాలతో కొన్ని హక్కులు సాధించుకోగలిగామని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె లోకనాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో దెబ్బతింటున్న ప్రజలను కలుపుకొని బలమైన ఉద్యమాలు నిర్వహించాలన్నారు. విఏఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె సూరిబాబు, ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ బాలకృష్ణ పాల్గొన్నారు.

విఏఎల రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన కర్నూలు జిల్లా స్థాయి శాప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు గురువారంతో ముగిశాయి. డిఎస్ఎ అవుట్‌డోర్ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాల్ లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా క్రీడా శాఖ సిఇఒ పివి.రమణ బహుమతులను అందజేశారు. క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మార్ ఎంటర్ప్రైజెస్ అధినేతలు మక్బూల్ అహ్మద్, ముజాహిద్‌లు ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు. జిల్లా క్రీడా శాఖ ప్రధాన శిక్షకులు నటరాజ రావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగా శాప్ లీగ్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

ఈనెల 27వ తేదీన తిరుపతిలో జరిగిన రెండవ రాష్ట్రస్థాయి శాప్‌యోగా లీగ్ పోటీలలో కర్నూలు జిల్లా చెందిన వి.చతుర్వేద 8 నుంచి 12 సంవత్సరాల బాలురు విభాగంలో రెండవ స్థానం, 8 నుంచి 12 సంవత్సరాల బాలికల విభాగంలో మనుశ్రీ మూడవ స్థానం, ఆరవ స్థానంలో కావ్యశ్రీ నిలిచారని కర్నూలు జిల్లా శాప్ యోగలీగ్ కోఆర్డినేటర్ అవినాష్‌శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కర్నూలు అవుట్డోర్ స్టేడియంలోని సిఇఒ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా క్రీడా శాఖ సిఇఒ పివి.రమణ ప్రశంసా పత్రాలతో పాటు వ్యక్తిగత బహుమతులను అందజేసి అందించారు. జిల్లా యోగా సంఘం సభ్యులు శశిధర్, ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్ : కెజిబివి పాఠశాలల్లో పనిచేసే బోధనా , బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బిటిఎ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థి డి రామ శేషయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రచారంలో భాగంగా కెజిబివిలో పనిచేసిన ఉద్యోగులు ఆయ నకు సమస్యలను విన్నవించుకున్నారు. కెజిబివిలో పనిచేసే సిఆర్‌పిలతో పని చేయించు కుంటున్న వేతనాలు కానీ ఇతర సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫల మైందన్నారు. కెబిబివిలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.

అర్‌యూలో పిజి స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటి పరిధిలో పిజిస్పాట్ అడ్మిషన్స్ జనవరి 4న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ మధూసూదనవర్మ ఓ ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. జనవరి 4వతేదిన జరిగే పిజి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. అసక్తి కల్గిన విద్యార్థులు 4న ఉదయం 9గంటలనుండి మధ్యాహ్నం 1గంటలోగా తమ దరాఖాస్తులతోపాటు ఫీజులను వెనువెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

దళితులపై దాడులను అరికట్టండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులను నియంత్రించేందుకు ఎస్‌సి కమిషన్ ప్రత్యేక చర్యలను తీసుకోవాలని కెవిపిఎస్ కోరింది. దళిత సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన చేసి అధికారులకు ఆదేశాలను ఇవ్వాలని డిమాండ్ చేసింది. గురువారం రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను కెవిపిఎస్ ప్రతినిధి బృందం కలసి వినతి పత్రం అందజేసింది. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధక్ష్యులు దడాల సుబ్బారావు, జి క్రాంతి కుమార్, సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షులు హైకోర్ట్ న్యాయవాది పాలేటి మహేశ్వరరావు, న్యాయవాది విద్యాచరణ్‌తోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలనుండి వచ్చిన దళితులు ఉన్నారు. దళితులపై జరుగుతన్న దాడులపై పోలీసుకేసులు పెడితే గ్రామపెద్దలు జోక్యం చేసుకొని కేసులను నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. బెదిరింపులకు పాల్పడుతూ రాజీ కావాలని బెదిరిస్తున్నారని అన్నారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. వివక్షతను రూపుమాపేందుకు వారంలో ఒకరోజు మండల అధికారులు గ్రామ పర్యటనలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల 30వ తేదీని పౌరహక్కుల దినం జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యాచారాలు, హత్యలు జరిగిన ప్రాంతాలకు జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు 24 గంటల్లో సందర్శించి బాధితులు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కోర్టులు, పోలీసుల వద్ద పెండింగులో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసులపై సమీక్ష జరిపి బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, భూములు, ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

- రాజ్‌భవన్ ముట్టడి చేపట్టిన సిపిఐ
- నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. ఫెడరలిజాన్ని కాపాడాలని, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. గాంధీనగర్లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరారు. మార్గమధ్యలో పోలీసులు అడ్డుకుని రామకృష్ణతో పాటు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, దర్గాంబ,రమణారావు తదితరులను అరెస్టు చేసి వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. జగన్ ఢిల్లీ వెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. గవర్నర్లను అడ్డం పెట్టుకుని బిజెపి యేతర రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణా వంటి అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేశారని వివరించారు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే తమ ఉద్దేశమని, అందుకోసం చేపట్టిన ఆందోళనలో ప్రజాస్వామ్యవాదులందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సీతారావమ్మ, నాయకులు నజీర్, సూరిబాబు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ డిప్యూటి కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పిపిఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి , తదితరులు

పింఛన్లను పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వం తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బాధితులు కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాలతో వికలాంగులు, వితంతువులు, వృద్ధుల, ఒంటరి మహిళల పింఛన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లను తొలగించడంతో వారంతా వీధిన పడాల్సి వచ్చిందని తెలిపారు. సంపన్నులను, ఇసుక, మద్యం మాఫియాలను వదిలేసి వికలాంగులు, వితంతువులు, వృద్ధుల పింఛన్లు రద్దు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే జరిపి అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో సంఘం నగర నాయకులు ఎం.నాగరాజు, ఎస్.నౌషద్, పి.ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎం అగ్రహారంలో దాడి హేయమైన చర్య

కర్నూలు కలెక్టరేట్: మద్దికెర అగ్రారంలో ఊరిదేవరలో అమాయకులపై దాడి చేసిన ఎమ్మెల్యే శ్రీదేవి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కర్నూలు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీదేవి అక్కడ జరిగిన ఘటనపై క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలన్నారు. ఈ సమావేశంలో సమితి నాయకులు డేవిడ్, రవికుమార్, నర్రా రాఘవరెడ్డి , గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలందేలా చర్యలు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకందే లా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం అమరావతిలో నుండి ఆయన జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతోపాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి గృహనిర్మాణ ం పై కూడా దృష్టిసారించాలన్నారు.జిల్లా కేంద్రంలోనుండి జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు,జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందర్‌రెడ్డి,సిపిఓ అప్పలకొండ పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.సంక్షేమ పథకాల అమలుకు దృష్టిసారించాలన్నారు.

కాల్వలో నర్సరీని పరిశిలించిన డ్వామాపిడి

ఓర్వకల్ మండలంలోని కాల్వగ్రామంలో చేపడుతున్న మొక్కల నర్సరీని జిల్లానీటియాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న నర్సరీలలో ఇక్కడ అన్ని రకాల మొక్కలను పెంపకం చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఎపిడి లక్ష్మన్నతోపాటు ఎపిఒలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న రంగనాథ్‌రెడ్డి

విద్యార్థులకు ట్యాబులుపంపిణీ

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని రామలింగయ్యపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 తరగతి చదువుతున్న విద్యార్థులకు వైసిపి నాయకులు రంగనాథ్ రెడ్డి, రాంపల్లిలో పత్తికొండ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్నారన్నారు. గతంలో పరిపాలించిన ముఖ్యమంత్రి ఏనాడు విద్యార్థుల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. విద్యార్థులకు భవిష్యత్తును అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, ప్రధానోపాధ్యాయులు హేమలత, వైసిపి నాయకులు తిమ్మారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ చెన్నకేశవులు, వడ్డే వెంకట రాముడు, చెన్నంపల్లి సుంకన్న, రంజాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. శ్రీనివాస రావు ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు బుధవారం కర్నూలు న్యాయ సేవ సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. అయన మాట్లాడుతూ పారిశ్రామిక కార్మికుల అర్హతకు సంబంధించి వివిధ సంక్షేమ పథకాలు గురించి అవగాహన సదస్సు , పిల్లల భిక్షాటన నిర్మూలనపై ప్రత్యేక ప్రచారం, అలాగే పారిశ్రామిక కార్మికుల కోసం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ న్యాయ సేవ సదస్సు నిర్వహించారు. పారిశ్రామిక కార్మికుల వారి అర్హతకు సంబంధించి వివిధ సంక్షేమ పథకాలకు అవసరమైన సహాయం సంబంధిత ప్రభుత్వం శాఖలు, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తాయని తెలిపారు. పిల్లల భిక్షాటన నిర్మూలనపై ప్రత్యేక ప్రచారం న్యాయ సేవ సదన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, జూబెద బేగం, చైర్ పర్సన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, రంగారెడ్డి, సమన్వయకర్త, చైల్డ్ లైన్ ఎన్‌జిఒలు, కార్మికులు, పోలీసులు పాల్గొనారు.

జిల్లా శాప్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

విజేతలతో సిఇఒ రమణ, స్పాన్‌సర్స్ , క్రీడాకారులు

జిల్లా శాఫ్ అథ్లెటిక్స పోటీలు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిఇఒ పివి.రమణ , సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ నాగ శేఖర్ , టోర్నమెంట్ స్పాన్సర్, ఇస్మాయిల్ బాష , డిఎస్ఎ సిబ్బంది, అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ హర్షవర్ధన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ సిబ్బంది లక్ష్మయ్య , బి.శ్రీనివాసులు అథ్లెటిక్స్‌లో ఇండియా కోచ్ జి.కాశిరావు పాల్గొన్నారు. సిఇఒ పివి రమణ మాట్లాడుతూ శాప్ నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం వలన మన ప్రదర్శన సామర్థ్యం తెలుసుకొని దానిని మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను అతిధులు ప్రారంభించారు.

జగన్ పాలన జనరంజకం : కాటసాని

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్:

ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి జనరంజకమైన పాలన చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం 32 వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ముజఫర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ట్యాబ్‌లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన జగనన్న పేద పిల్లలు చదువుకోవడానికి ఇచ్చిన పథకాలు చాలా అద్భుతమైనవనీ మీరు వాటిని ఉపయోగించుకోవాలి అన్నారు. స్థానిక వార్డ్ కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి, వైజా బాలచంద్రా రెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి, వైసిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సిసెల్ శివ సందేపోగు, నాయకులు పెద్ద టేకూరు హనుమంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పర్ల సుంకన్న, శంకర్‌రెడ్డి, సాయి, గోపినాథ్, ఇస్మాయిల్, ఉస్మాన్, షెక్షావలి, రామన్న,హోటల్‌బాష, రామాంజనేయులు, ముళ్ల హుస్సేన్ సాహెబ్, అబ్దుల్లా, హరి, విద్యా కమిటీ చైర్మన్ రాజు(సిరాజ్), మనోరాజు, నరేష్, విద్యాశాఖ అధికారులు ఎంఇఒ శ్రీనివాసులు, పాఠశాలసిబ్బంది, ఎలక్ట్రికల్, ఎఇ.నాగరాజు, ట్యాప్ ఇన్స్పెక్టర్ వెంకట రాముడు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

6వ వార్డులో టిడిపిలోకి భారీగా చేరికలు

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన టిజి.భరత్ కోట్ల

సినీ హీరో సల్మాన్ ఖాన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే తాము రాజకీయాల్లో ఉన్నామని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. నగరంలోని 6వ వార్డులో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి టిజి.భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్డులోని వీధుల్లో తిరిగి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా 12 గ్రూపులకు చెందిన ప్రజలు టిడిపిలోకి చేరారు. భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో టిజి భరత్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి చెప్పుకోవడానికి రాజధాని లేదన్నారు. చంద్రబాబు ఉండింటే రాష్ట్రం అభివద్ధి చెంది ఉండేదన్నారు. ఇక కర్నూల్లో తాను గెలిస్తే తనకున్న పరిచయాలతో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాది అవకాశాలు కల్పిస్తానన్నారు. అనంతరం సినీ హిందీహీరో సల్మాన్ ఖాన్ బర్త్ డే వేడుకల్లో భాగంగా భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో భాగంగా కోట్ల, టిజి, సోమిశెట్టిలను భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన మహమ్మద్ గౌస్, సలీంఖాన్, హమీద్, కన్నా గౌడ్, అబ్దుల్లా, ఖాజా ఖాన్, మహబాష, బాషా ఖాన్, నబీ ఖాన్, అహ్మద్ ఆలీ ఖాన్, షబీర్, ఖాదర్, నేతలు జహంగీర్, ఇబ్రహీం, మహబూబ్, సయ్యద్ నయిం, జుబేర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

టిజి.భరత్ ,కోట్ల, సోమిశెట్టిలకు సన్మాన

ట్యాబుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ట్యాబ్‌లను అందస్తేన్న పాఠశాల హెచ్‌ఎం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బైజ్యూస్ కంటెంట్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం నేడు ట్యాబ్ లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వెంకటరెడ్డి అధ్యక్షతన గురువారం పంపిణి కార్యక్రమం జరిగింది. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్. మహబూబ్ బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల పేరెంట్స్ కమిటి చైర్మన్ ఎస్.మాబాషా, వైస్ చైర్మన్ ఎన్.యశోద, కమిటి మెంబర్స్ ఎస్.కరిముల్లా, డి. వెంకటేశ్వర్లు, ఎస్. పర్వీన్,గీతారాణి తదితరులు హాజరయ్యారు. ప్రధానోధ్యాయులు టి వెంకటరెడ్డి విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాన్ని వినియోగించుకొని విద్యార్థులు సబ్జెక్టును చక్కగా అవగాహన చేసుకొని ఉత్తమ జ్ఞానాన్ని పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి ఎస్.మహబూబ్ భాషా మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించుటకు ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ఎక్స్ అఫిషియో మెంబర్లు కె. శ్వేతా రెడ్డి, లయన్ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎం సుగుణమ్మ, డి. ఆర్. గోపాల్ రెడ్డి పాఠశాల పేరెంట్స్ కమిటి చైర్మన్ ఎస్.మాబాషా మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథులు, పేరెంట్స్ కమిటి మెంబెర్స్, ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు ట్యాబ్ లు ఈ విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువు తున్న 209 మంది విద్యార్థులకు బై జ్యూస్ యాప్ ఇన్స్టాల్ చేసి విద్యార్థులకు అందించడం జరిగింది.

ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ , తదితరులు

31న డోన్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రజాశక్తి-డోన్ : డోన్ పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.రెండు కోట్లతో నిర్మించిన రావు బహదూర్ బుగ్గన శేషారెడ్డి ఇండోర్ "ఇండోర్ స్టేడియాన్ని ఈనెల 31న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం ఆయన ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. 31న ఉదయం 10గంటలకు ఆర్థిక మంత్రి ప్రారంభిస్తారని వివరించారు. ఇందిలో సిథటిక్ కోర్టు విత్ గ్యాలరీతో పాటు, పిల్లలకు, పెద్దలకు టాయిలెట్స్‌ను కూడా నిర్మించినట్లు వివరించారు. ఛైర్మన్ తోపాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొట్రికె హరికిషన్, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, నాగేంద్ర , ,మున్సిపల్ ఎఇ జనార్ధన్ పాల్గొన్నారు.

కందుకూరు మృతులకు నివాళ్లు అర్పిస్తున్న డోన్ టిడిపి నాయకులు

కందుకూరు మృతులకు డిటిపి నేతల సంతాపం

ప్రజాశక్తి-డోన్ : ప్రకాశం జిల్లా కందుకూరు ఘటనలో మృతిచెందిన టిడిపి కార్యకర్తలకు దురువారం డోన్ పట్టణంలో టిడిపి నాయకులు సంతాపం ప్రకటించారు. కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున మాట్లాడారు. బుధవారం కందుకూరులో నిర్వహించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటనలో విషాదం చోటు చేసుకుం దన్నారు. వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు పోటెత్తడంతో తోపులాటలో సభ సెంటర్లో పెద్ద కాలువ ఉంటుందని ఊహించకపోవడంతో దురదృష్టవశాత్తూ కాలువలో పడి కార్యకర్తలు 8మంది మరణించడం చాలా బాధాకరమని అన్నారు. వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రమాదవశాత్తు చనిపోయిన మరణాలతో కూడా రాజకీయ లబ్ది పొందాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాముడు , డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగు యువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్, డోన్ నియోజకవర్గ టిడిపి బిసి సెల్ కమిటీ సభ్యులు వలసల సుధాకర్, రామదుర్గం జయరాముడు, డోన్ పట్టణ టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కేబుల్ కిరణ్ , డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగు యువత కమిటీసభ్యులు ప్రవీణ్‌రెడ్డి , సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, డోన్ పట్టణ టిడిపి బిసిసెల్ ఉపాధ్యక్షులు జిలేబి ధను, ఉడుములపాడు నాగేంద్ర , టైలర్ ఖాజా, డాన్ శ్రీను పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

తెలుగునాడు స్టూడెంట్స్‌ఫెడరేషన్ టిఎన్ఎస్ఎఫ్ అధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా అసంఘం కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యంచెందిందన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, మెస్, కాస్మోటిక్ చార్జీలను సరిగ్గా చెల్లించడంలేదన్నారు.

ప్రజాశక్తి
శుక్రవారం 30 డిసెంబర్ 2022 5 నంద్యాల

ప్రచార యాత్రలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వరూప రాణి

అర్బన్ డెవలప్మెంట్ పేరుతో చాబోలు

భూములు లాక్కునేందుకు కుట్ర..

- ఇండస్ట్రీయల్‌కు ఇవ్వబోమని గ్రామ సభలో రైతులు ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన రైతుల భూములను అర్బన్ డెవలప్‌మెంట్ పేరుతో లాక్కునేందుకు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాబోలు గ్రామ రైతులకు, ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామసభ నిర్వహించకుండా కుడా కిందకు భూములను తీసుకుపోవడంపై స్థానిక రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను రైతులు కలవగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అయితే రైతులు ఏకంగా కర్నూల్‌లోని కుడా చైర్మన్‌ని కలిసి తమ భూములను ఇవ్వబోమని తేల్చి చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయం మేరకే కుడా కిందకి భూములను తీసుకుంటున్నామని కుడా చైర్మన్ చెప్పినట్లు సమాచారం. ఇదే విషయంపై బుధవారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని గ్రామ రైతులు కలిసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ భూములను ఇండస్ట్రియల్ కింద, ట్రాన్స్ పోర్ట్ కింద తీసుకోవద్దని ఎమ్మెల్యేను కోరారు. రైతుల అనుమతులు లేకుండా భూములను తీసుకుంటే తీవ్ర వ్యతిరేకత ఎదురుకోవాల్సి వస్తుందని రైతులు బాహాటంగానే హెచ్చరించారు. అలాగే బుధవారం సాయంత్రం జరిగిన గ్రామసభలో రైతులు తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని తీర్మానం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్థానికంగా వస్తున్న వ్యతిరేకతను గుర్తించి భూములను కాపాడాలని గ్రామ రైతులు కోరుతున్నారు. అయితే చాబోలు భూముల వ్యవహారం నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మెడకు చుట్టుకుంటోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం, కుడా ఇచ్చిన డ్రాఫ్ట్‌ను రద్దు చేయాలి

చాబోలు రైతుల భూములకు సంబంధించి ప్రభుత్వం, కుడా ఇచ్చిన డ్రాఫ్ట్‌ను రద్దు చేయాలి. చాబోలు గ్రామ రైతుల భూములను బలవంతంగా లాక్కోడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రైతుల అభిప్రాయం మేరకే భూములను తీసుకోవాలి. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోం. ప్రభుత్వం, అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేకుంటే రైతుల పక్షాన సిపిఎం చేపట్టే ఆందోళనకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుంది.

సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

- సిఐటియు రాష్ట్ర నేతలు స్వరూప రాణి, ఆర్‌వి.నరసింహారావు, ఓబులు
- నంద్యాలకు చేరుకున్న రాష్ట్ర కార్మిక చైతన్య బస్సుయాత్ర

ప్రజాశక్తి - నంద్యాల

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జనవరి 2, 3, 4వ తేదీల్లో జరుగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వరూప రాణి, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర నాయకులు ఓబుల్‌లు కార్మికులకు పిలుపునిచ్చారు. హిందూపురంలో ప్రారంభమైన రాష్ట్రవ్యాప్త కార్మిక చైతన్య బస్సు యాత్ర గురువారం నంద్యాల పట్టణానికి చేరుకుంది. పట్టణంలోని కోవెలకుంట్ల జంక్షన్‌లో, గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహం ముందు జరిగిన బహిరంగ సభలకు సిఐటియు పట్టణ కార్యదర్శి కెఎండి గౌస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విద్యుత్, బ్యాంకు తదితర రంగాల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వ హించాలని తెలిపారు. రాష్ట్రాల మధ్య చిచ్చుపట్టే మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనవరి 2న భీమవరం పట్టణంలో జరిగే బహిరంగ సభ, ర్యాలీకి ఉద్యో గులు, కార్మికులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, ఉపాధ్యక్షులు టి.మద్దులు, సహాయ కార్యదర్శి వి. బాల వెంకట్, పి.వెంకట్ లింగం, పట్టణ నాయకులు పుల్లయ్య, యేసు నరసింహ, కార్మికులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు పూర్తి చేయండి

- భూ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకం కింద సమగ్ర రీసర్వే పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని భూపరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుండి సిసిఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథక రీ సర్వే పనులు, మ్యుటేషన్స్ దరఖాస్తుల పరిశీలనపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడి హరికష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాలలో భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యుటేషన్స్ దరఖాస్తుల కరెక్షన్స్, ట్రాన్సాక్షన్‌పై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌పై పక్కాగా విచారణ జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర రీ సర్వేపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

జాతీయ రహదారుల భూ సేకరణ పూర్తి చేయండి

- ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ పి.ఎస్.ప్రద్యుమ్న అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు సూచించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి జాతీయ రహదారులకు భూ సేకరణపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ప్రిన్సిపల్ సెక్రటరీ పి.యస్ ప్రద్యుమ్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎస్.ప్రద్యుమ్న మాట్లాడుతూ రహదారుల భూ సేకరణకు సంబంధించి ప్రధాన ప్రాంతాల్లో మార్కెట్ ధరకు, రైతులు కోరుతున్న ధరలకు భారీ వ్యత్యాసాలు ఉంటే జిల్లా కలెక్టర్లు, సంబంధిత జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్లు స్వయంగా తనిఖీలు నిర్వహించి ధరలను నిర్ధారించాలని సూచించారు. రహదారుల నిర్మాణాలకు నిధులు అందుబాటులో వున్నాయని, భూసేకరణ, పరిహారాల చెల్లింపు పూర్తి చేసి రహదారుల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ గుంటూరు - గుంతకల్ జాతీయ రహదారికి సంబంధించి 29.19 హెక్టార్ల పట్టా భూములకు 8.51హెక్టార్ల భూసేకరణ పూర్తయిందని, మిగిలిన 20.68 హెక్టార్ల పట్టా భూముల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. 17.21 హెక్టార్ల ప్రభుత్వ భూముల భూసేకరణ పూర్తయిందని, 4.57 హెక్టార్ల అటవీ భూముల సేకరణ పెండింగ్లో వుందని వివరించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి :

- రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో రెండవ రోజు జరుగుతున్న 66వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడా పోటీలకు వచ్చిన క్రీడాకారులకు ముందుగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఆళ్లగడ్డలో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలన్నారు. విద్యార్థుల జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలన్నారు. క్రీడారగానికి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ రమణారెడ్డి, తైక్వాండో మాస్టర్ చంద్రమౌళి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

2022 సాగిందిలా..

- నూతన జిల్లాలతో మారిన స్వరూపాలు
- వర్షాలు, నకిలీ విత్తనాలతో రైతన్నలకు నష్టాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2022 ఏడాది మరికొన్ని గంటల్లో ముగిసి పోనుంది. సంవత్సరం ప్రారంభమైన నాలుగో నెల నుంచే రెండో దశ కరోనా విజృంభించింది. అధిక వర్షాలు, వర్షా భావంతో పాటు నకిలీ విత్తనాలతో రైతన్నలు నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాల విభజనతో జిల్లా స్వరూపాలు మారాయి. ఈ ఏడాది ఎలా ముగిసిందో ఓ లుక్కేద్దాం రండి.....

కొత్త రూపం..

కర్నూలు జిల్లా కొత్త రూపంలోకి మారింది. ఏప్రిల్ 4న కర్నూలు జిల్లా రెండు ముక్కలు అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 మండలాలు ఉండగా కొత్తగా కర్నూలు, నంద్యాల అంటూ రెండు జిల్లాలుగా విభజించారు. 26 మండలాలతో కర్నూలు జిల్లాను 29 మండలాలతో నంద్యాల జిల్లాను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో గతంలో ఉన్న నంద్యాల రెవెన్యూ డివిజన్‌కు తోడుగా ఆత్మకూరు, డోన్‌లను కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు డివిజన్‌లో 10 మండలాలు, నంద్యాల డివిజన్‌లో 13 మండలాలు, డోన్ డివిజన్‌లో 6 మండలాలు ఉన్నాయి. నంద్యాల జిల్లా కలెక్టర్‌గా మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పిగా కె.రఘువీర్‌రెడ్డి నియమితులయ్యారు.

నష్టాల 'మాండూస్' : ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని రైతులను ఈ ఏడాది మాండూస్ తుపాను వణించింది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటంతో పంటలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడటంతో తడిసి ముద్దయింది. కర్నూలు జిల్లాలో 6,74,864 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తైంది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధ మవుతున్న సమయంలో వర్షం పడటంతో తడిసి పనికిరాకుండా పోతోంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోయింది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల చేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

'హంద్రీ' రైతుల ఆందోళన : హంద్రీనీవా కింద రైతులు వేసిన పంటలకు మార్చి నెల చివరి వరకు ఇస్తామని తొలుత చెప్పిన అధికారులు ప్రస్తుతం జనవరి వరకే ఇస్తామని చెబుతున్నారు. హంద్రీనీవా కింద ఉమ్మడి జిల్లాలో 40 వేల ఎకరాల్లో రబీలో పంట వేశారు ఇప్పుడు హంద్రీనీవా అధికారులు మార్చి చివరి వరకు సాగునీరు అందించలేమని చెప్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో అధిక వర్షాలు రావడం, తెగుళ్ల రావడం, నకిలీ విత్తనాల వల్ల వేసిన పంటలు చేతికి రాక అప్పులతో విలవిలలాడుతున్న రైతులకు రబీలో అయినా పంటలు సాగు చేసుకునేందుకు అధికారులు అవకాశం లేకుండా చేశారు.

టమోటా రైతు విలవిల : టమోటా ధర రోజురోజుకూ పడిపోతుండడంతో సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెల రోజుల క్రితం ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ధర పడిపోవడంతో రైతులు దిగులు పడ్డారు. బాక్సు (25 కిలోలు) ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కోత కూలిలు, రవాణ ఖర్చులు, కమీషన్ పోను రైతుకు ఏమాత్రం మిగలకపోవడంతో నష్టపోతున్నారు.

పరిహారాన్ని పెంచి ఇవ్వాలని ఎమ్మెల్యేను అడుగుతున్న పిన్నాపురం బాధితులు (ఫైల్)

ఆగని బన్ని ఉత్సవం : బన్ని ఉత్సవంలో ఈ ఏడాది కూడా రక్తపాతం ఆగలేదు. హోళగుంద మండల పరిధిలోని శీ మాల మల్లేశ్వర జైత్రయాత్ర (బన్ని ఉత్సవం)లో భాగంగా ఈ ఏడాది కూడా కర్రల సమరం జోరుగా సాగింది. జైత్ర యాత్రలో పాల్గొన్న వారిలో రింగ్ కర్రలతో కొట్టుకోవడంతో పాటు అగ్ని దివిటీల ఆవిరి తగిలడంతో 86 మందికి గాయాలయ్యాయి. మరో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'పిన్నాపురం'పై నిర్బంధం : రెండు జిల్లాలకు మధ్యలో ఉండే ప్రాంతమది. ప్రధాన రహదారులకు దూరంగా ఎక్కడో కొండల గుట్టల మధ్య ఉన్న గ్రామమది. ఆ గ్రామస్థులు వారం రోజులుగా నిర్బంధానికి గురవుతున్నారు. ఊరి నుంచి వెళ్లకుండా, ఊరిలోకి ఎవరూ రాకుండా పోలీసులు పహారా కాశారు. అది పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామ ప్రజల పరిస్థితి. వారు చేసిన తప్పల్లా గ్రామంలో ప్రాజెక్టు పడితే ఊర్లో పది మందికి పని దొరుకుతుందని ఆలోచించడమే. పిన్నాపురం మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో ఎక్కడో మారుమూలన కొండ ప్రాంతాల్లో ఉంది. ఆ గ్రామంలో దాదాపు 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఓర్వకల్లు మండలం గుమ్మితం తండాతో పాటు పాణ్యం మండలంలోని పిన్నాపురం పరిసర భూములను సదరు కంపెనీ సేకరించింది. రైతులు సాగు చేసుకుంటున్న 2వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న 500 ఎకరాలకు మాత్రమే

స్థానిక మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రుద్రవరం

అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మెయిన్ బజార్, బలిజ పేట, కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు ఎమ్మెల్యే పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్, గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీచైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి,సర్పంచ్ బైరి విజయలక్ష్మి, తాసిల్దార్ వెంకట శివ, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఈవోపిఆర్‌డి భాగ్యలక్ష్మి, ఉపాధి ఏపీఓ ప్రతాప్, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, పిఆర్ ఏఈ వెంకటరాముడు, ఏవో జ్యోతి, విద్యుత్ రాఘవేంద్రారెడ్డి ఆర్డబ్ల్యూఎస్సీ ఏఈ ప్రమోద్, కార్యదర్శులు, మహమ్మద్ రఫీ, అరవింద నాయక్, మౌనిక, వీఆర్వోలు వెంకటరమణ, యువకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం : టిడిపి

కొలిమిగుండ్ల : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో బుద్ధి చెబుదామని టిడిపి నాయకులు మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఈ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్ రెడ్డి మోసపు హామీలు ఇచ్చారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇదేంకర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజల పక్షాన ప్రజాశక్తి : భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

- ప్రజాశక్తి-2023 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షాన నిలబడుతుందని, నిజాలను నిర్భయంగా రాస్తూ అందరి మన్ననలు పొందుతుందని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలిపారు. ఆళ్లగడ్డలోని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ నివాసంలో ప్రజాశక్తి-2023 క్యాలెండర్, డైరీని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జ్ మల్లికార్జునరావు, ఆళ్లగడ్డ రిపోర్టర్ నిజాముద్దీన్, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష, నంద్యాల పార్లమెంట్ మైనార్టీ నాయకులు నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మాబు షరీఫ్, బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, తెలుగు నాడు కార్యదర్శి గుత్తి నర్సింహులు, మండల ప్రచార కార్యదర్శి గఫార్ భాష, ప్రధాన కార్యదర్శి అలంసా గారి హనీఫ్, కొలిమి షబ్బీర్, కొలిమి అష్రాఫ్, ముళ్ళ షాబుల్, మొహిదీన్, కొలిమి మాభాష, హుస్సేన్ భాష, పట్టణ యువత కార్యదర్శి కొలిమి సోను, నాయకులు మౌలాలి, ఖలీల్, జెట్టి నాగరాజు, బషీర్ వలి, నాగూర్, కాజా రసూల్, ఆర్.మాభాష, చోటు, కశినేని ఓబులేసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుంది : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నేషనల్ హైవే-44 నుంచి వెంగలాంపల్లె మీదుగా పిబిజి రోడ్ వరకు కోటి రూపాయల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్యాపిలిలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డోన్ నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి, ప్యాపిలిలో 50 కోట్లతో ఇంటిగ్రేడ్ మార్కెట్, 28 చెరువులకు నీరు నింపే కార్యక్రమం, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రతి ఇంటికి మంచినీరు, ప్రతి ఊరికి తారు రోడ్డు, హుసేనాపురంలో షప్పర్డ్ ట్రైనింగ్ సెంటర్, బాలికల రెసిడెన్షియల్ కాలేజ్ అనేక అభివద్ధి సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మీట్ చైర్మన్ శ్రీరాములు, జడ్పిటిసి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, దిలీప్ చక్రవర్తి, బోరెడ్డి పుల్లారెడ్డి, రామాచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, రమేష్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, బోరా మల్లికార్జున రెడ్డి, బోరెడ్డి రాము, ఎర్రిస్వామి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రకళాధర్ రెడ్డి, రాచర్ల రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రెడ్డి, విగ్నేశ్వర్ రెడ్డి, విష్ణు, రసూల్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల విజేత కర్నూలు జట్టు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలలో కర్నూలు స్టేడియం జట్టు ప్రతిభ కనపరిచి విజేతగా నిలిచిది. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి సహకారంతో ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో 30 జట్లు పాల్గొన్నాయి. రెండవ స్థానంలో సుంకేసుల జట్టు, మూడో స్థానంలో ఆత్మకూరు, నాల్గో స్థానంలో దామగట్ల జట్టు నిలిచాయి. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.8 వేలు, మూడవ బహుమతి రూ.4 వేలు, నాల్గవ బహుమతి రూ.2 వేలు నగదు ప్రదానం చేశారు.

చౌడేశ్వరి దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023లో ఈశ్వరి దేవి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. నియోజకవర్గం ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి విఎల్‌ఎన్ రామానుజన్, మాజీ ఆలయ చైర్మన్ పిఆర్ వెంకటేశ్వర రెడ్డి, చౌడేశ్వరి బోర్‌వెల్ అధినేత బుర్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బిసి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి ఫరుక్ పరామర్శించారు. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి నివాసంలో ఆయన అన్న బిసి. బాల తిమ్మారెడ్డి చిత్రపటానికి మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి.ఇందిరా, మాజీ సర్పంచి బిసి రాజా రెడ్డిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో గురువారం స్వచ్ఛత యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమం ఎపి టూరిజం హరిత హోటల్‌లో జరిగింది. నెల్లూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పి.శరవణన్ మాట్లాడుతూ పరిసరాలు, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్రంలో పారిశుధ్యాన్ని పాటించడం అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ రోజుకా రోజు ప్రత్యేక ప్రక్రియను అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛ శ్రీశైల సాధనకు దేవస్థానం చేపట్టిన చర్యలకు స్థానిక సత్రాల యాజమాన్యాల వారు, హోటల్ నిర్వాహకులు, వ్యాపారులు, స్థానికులతో పాటు భక్తులు అందరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిరోధించాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి టి శ్రీనివాస్, శానిటేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

తెగుళ్ల బారిన పప్పు శగన పంట

- ఎండిపోతున్న పైరు

ప్రజాశక్తి - సంజామల

మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పప్పు శనగ పంట తెగుళ్ల బారిన పడింది. మండలంలోని సంజామల, కానాల, కమలపురి, ఆకుమల్ల, ఆలవకుండ గ్రామాలలో వైరస్‌తో శనగ పంట దెబ్బతిందని రైతులు వెంకటేశ్వర్ రెడ్డి, పుల్లారెడ్డి, సుబ్బరాయుడు, విజయలక్ష్మి తదితరులు తెలిపారు. ఇప్పటికే ఎకరాకు పదివేల రూపాయలు ఖర్చయిందని, వైరస్ తగలడంతో ఎకరాకు పది బస్తాలు వచ్చే శనగ పంట ఆరు బస్తాలే వస్తాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న శనగ పంట రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

సంజామల మండలంలో తెగుళ్లతో దెబ్బతిన్న శనగ పంట

లీజ్ ఒప్పందాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : సబ్ రిజిస్టర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మాట్లాడుతున్న సబ్ రిజిస్టర్

ఆళ్లగడ్డ పట్టణంలోని పలు వ్యాపార సంస్థలు తమ దుకాణాల లీజు ఒప్పందాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క ఆళ్లగడ్డ పట్టణంలో 2000కు పైగా దుకాణాలు ఉన్నాయని, వీటిలో 20 శాతం మాత్రమే అసలైన యజమానులు ఉన్నారన్నారు. మిగతా వారందరూ లీజ్ ఒప్పందం మీద ఏళ్ల తరబడిగా నడుపుకుంటున్నారని, వీటికి చట్టబద్ధత లేదన్నారు. దుకాణాలను లీజుకు పొందిన వ్యాపారులు వాటి చట్టబద్ధత కోసం కొద్ది వ్యయంతో తమ కార్యాలయంలో డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. లేనిపక్షంలో 70, 74 రిజిస్ట్రేషన్ యాక్ట్ ద్వారా వారికి నోటీసులు జారీ చేసి జరిమానా సైతం వసూలు చేస్తామన్నారు. ఈ విషయమై తాము ఆళ్లగడ్డ పట్టణంలో స్పెషల్ డ్రైవ్‌ను కూడా త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో క్షయవ్యాధి దూరం

పాములపాడు : పౌష్టిక ఆహారంతో క్షయ వ్యాధిని అధిగమించవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున అన్నారు. గురువారం పాములపాడు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాది గ్రస్థునికి పౌష్టికాహార కిట్‌ను హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఎంఎల్‌హెచ్‌పి మమతలు అందజేశారు. క్షయవ్యాది నిర్మూలనలో పౌష్టికాహారం కీలకమని వైద్యాధికారి గులాబ్ షా మోమిన్ అన్నారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్లు చెరుకు రవికుమార్, మస్తానయ్య, సూపర్వైజర్లు గుర్రప్ప, ఝాన్సీ, ఎంఎల్‌హెచ్‌పి సృజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

కొలిమిగుండ్ల : కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. కోటపాడు గ్రామంలో వరిమల్ల కుంట దగ్గర ఉదయం 9 గంటల సమయంలో గొర్రెల పెంపకదారులు ఎం.నడిపి వీరయ్యకు చెందిన గొర్రె పిల్లలు ఉన్న కంచెను కుక్కలు దాటి వెళ్లి దాడి చేశాయి. 15 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. పశు వైద్యాధికారిణి డాక్టర్ పద్మావతి పరిశీలించి గొర్రె పిల్లలను పోస్టుమార్గం చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. విషయం తెలిసిన గొర్రెల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్ బి జయరాముడు యాదవ్ కోటపాడుకు చేరుకుని పరిశీలించారు. విషయాన్ని రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. గొర్రెల పెంపకదారుల సంఘం నాయకులు కోటపాడు వెంకటేశ్వర్లు, పుల్లయ్య యాదవ్, శివకృష్ణ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఎల్ డైరీ ఆవిష్కరణ

నంద్యాల అర్బన్ : నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఐఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ కోర్టు డైరీని గురువారం ఆవిష్కరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ కె.రంగనాథ మాట్లాడుతూ న్యాయవాదులకు ఈ డైరీ చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఐఏఎల్ నాయకులు నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

బేతంచర్ల : బేతంచర్లలోని ఎస్‌టియు కార్యాలయంలో ఎస్‌టియు నూతన సంవత్సర క్యాలెండర్ జిల్లా అధ్యక్షులు ఎస్.అజాం బేగ్ గురువారం ఆవిష్కరించారు. మండల నాయకులు అన్వరుల్లా, ఉపాధ్యాయులు పాపారాయుడు, వెంకటేశ్వర నాయక్, హరికృష్ణ, కృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా బాయికటి ప్రహ్లాద

నంద్యాల రూరల్ : నంద్యాల జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(సఫాయి కమిషన్) సభ్యులుగా దళిత నాయకుడు బాయికాటి ప్రహ్లాద ఎన్నికయ్యారు. గురువారం జిల్లా సఫాయి కర్మచారులసంక్షేమ సంఘం ప్రదాన కార్యదర్శి నందవరం నరసింహ శుభాకాంక్షలు తెలియజేశారు. దళితుల హక్కులు పరిరక్షించడంలో ముందు వరుసలో ఉంటారని ఆశిస్తున్నామని తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి శివ బాలకృష్ణ, కె రాముడు డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మండల నాయకులు ఖాదర్, హోటల్ రాముడు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి

నంద్యాల కలెక్టరేట్ : పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపి ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు టి. మణిశేఖర్ రెడ్డి, కార్యదర్శి హుస్సేన్ రెడ్డిల ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసారెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు : ఎఒ

చాగలమర్రి : గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని లక్ష్మీవెంకటసాయి సీడ్స్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. దుకాణంలో విత్తనాల స్టాకును పరిశీలించారు. అనంతరం నువ్వులు , కొర్రల వితనాలను నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

కొలిమిగుండ్ల : సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పుస్తకం ఆధారంగా బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. అంకిరెడ్డి పల్లి వడ్డే పేటలో కొత్త బోరు వేయాలని అర్జీపై విచారించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వీధి దీపాలకు మరమ్మతులు

మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సిరివెళ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలో విద్యుత్ వీధి దీపాలకు సర్పంచి దూదేకుల హుస్సేన్ బీ గుర్రప్ప గురువారం మరమ్మతులు చేయించారు. కొత్తగా 4 బల్బులు, పాతవి 10 రిపేరు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామ నాయకులు వంకదారి సుబ్బ సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరి పాల్గొన్నారు.

ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివేలా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం బండి ఆత్మకూరులోని మోడల్ పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, సర్పంచ్ ఎరుకల సంధ్య, మాజీ సర్పంచులు సుజాతమ్మ, ఉపాధ్యక్షులు మధురాణి, మాజీ ఎంపిపి ఎస్ వెంకట్రామిరెడ్డి, చైర్మన్ చిన్న సుబ్బారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిన్న మద్దిలేటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ శ్రీరాములు ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి కుసుమలత, జడ్పిటిసి సోముల సుధాకర్ రెడ్డిలు ట్యాబులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచి లక్ష్మీదేవి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, నారాయణ, అయుబ్, అహ్మద్, వైసిపి నాయకులు జనార్దన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు. **శిరివెళ్ల :** శిరివెళ్లలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి నాయక్ మహమ్మద్ వసీం, వక్ఫ్‌బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్‌లు సలాం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జడ్పిటిసి దిల్షాద్ ముజఫర్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ ఇంతియాజ్, లక్కాకుల చంద్ర, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా :** మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం సరోజిని అధ్యక్షతన సర్పంచి పుట్టల కృపమ్మ, విద్యా కమిటీ చైర్మన్ వెంకటరమణ గౌడు ట్యాబ్‌లు అందజేశారు. ఎంఇఒ, మాజీ ఎంపీటీసీ చిన్న తిరుపాలు, ప్రతాప్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రాచర్ల సర్పంచ్ ఆసియా పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు ధనుంజయ రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని తిమ్మాపురం గ్రామం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి 517 ట్యాబులను అందజేశారు. ఎంఇఒ రామసుబ్బయ్య, ప్రిన్సిపల్ లక్ష్మణ్, వైసిపి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శిరివెళ్లలో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎంపిపి

కొత్తపల్లిలో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తెలంగాణ బోటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదిలో తిరుగుతున్న తెలంగాణ బోటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి కుసుమలత, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి తెలిపారు. గురువారం కొత్తపల్లి తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపిడిఒ మేరీ, పోలీస్ స్టేషన్‌లలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణానదిలో సంగమేశ్వరం, సిద్దేశ్వరం గ్రామస్తులు ఇంజన్ బోట్ల రవాణా జరుగుతుందని, అయితే తెలంగాణ బోటు నిర్వాహకులు మా ప్రాంతానికి వచ్చి ఇక్కడి మనుషులను కూడా బోటులో ఎక్కించుకుపోతున్నారని, దీంతో బోటు నమ్ముకొని జీవిస్తున్న వారి జీవనాధారం గడవడం కష్టంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బోటు నిర్వాహకుల మధ్య జరుగుతున్న సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందిస్తూ ఇరు వర్గాలను పిలిపించి ఇద్దరికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, నారాయణరెడ్డి, ఎర్రమఠం సర్పంచ్ బాల ఎల్లయ్య, గ్రామస్తులు పెద్ద స్వామి, కోటకొండ నాగిరెడ్డి, పేపర్ బిచ్చన్న, నాగిరెడ్డి, జగన్, మునగాల నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపిపి, జడ్పిటిసి

గిన్నిస్ బుక్ రికార్డు సాధించాలనే పట్టుదలతో సైకిల్ యాత్ర చేస్తున్న చైతన్యను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

చైతన్యకు మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి అభినందన

బనగానపల్లె : గిన్నిస్ బుక్కు రికార్డు సాధించాలనే పట్టుదలతో సైకిల్ యాత్ర చేస్తున్న చైతన్యను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అభినందించారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంకు చెందిన యువకుడు ఆర్యవైశ్య చైతన్య 28 రాష్ట్రాల మీదుగా 50 వేల కిలో మీటర్లు. 600 రోజులు సైకిల్ యాత్ర చేస్తూ గురువారం బనగానపల్లెకు చేరుకున్నారు. మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యల ఆధ్వర్యంలో చైతన్యను అభినందించి శాలువా, పూలమాలలతో సత్కరించారు. చైతన్య అనుకున్న లక్ష్యం మేరకు సైకిల్ యాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బింగిమళ్ళ సుబ్రమణ్యం, బొబ్బల మద్దిలేటిరెడ్డి , శేషశయనారెడ్డి , రిటైర్డ్ హెచ్ ఎం వెంకటరామిరెడ్డి , బాలతిమ్మారెడ్డి , హరికుమార్ రెడ్డి, గుళ్లదుర్తి హరి, లక్ష్మీకాంత రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు .

టిటిడి ఇఒ ధర్మారెడ్డికి ప్రముఖుల పరామర్శ

జూపాడుబంగ్లా : టిటిడి ఇఒ ధర్మారెడ్డిని గురువారం పలువురు ప్రముఖులు పారుమంచాల గ్రామానికి వచ్చి పరామర్శించారు. అటవీ శాఖ మంత్రి బాలనేని శ్రీనివాసరెడ్డి, మాజీ కేంద్ర ఎన్నికల అధికారి ఆరోరాలు చంద్రమౌళి రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

నవనంది యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

బనగానపల్లె : నంద్యాలలో నవనంది యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆర్‌ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీధర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శ్రీసాయి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌ఎస్‌యు) నంద్యాల జిల్లా మొదటి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పని చేయాలి

- డీ నోటిఫైడ్ సంచార, అర్థ సంచార వర్గాల డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ తుర్క నరసింహ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేట్, కార్పొరేట్‌కు ధీటుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డీ నోటిఫైడ్ సంచార, అర్థ సంచార వర్గాల డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ తుర్క నరసింహ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన జిల్లాలోని విద్య, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో సంచార, అర్థ సంచార జాతుల వారికి ప్రాధాన్యతనిచ్చి వారి అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. శాంతి, భద్రత అంశంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి నివేదిక ఇవ్వడంతో పాటు, సదరు కేసులో కమిట్ అయిన వారికి ఏ విధంగా పరిహారం చెల్లించారు తదితర వాటిపై (ఎస్సీ ఎస్టి సెల్) డిఎస్పీ రామంజి నాయక్‌ను అడిగి తెలుసుకొని దానిపై మొత్తం నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డిఇఒ అనురాధ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, జిల్లాలోని మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు, వివిధ సబ్జెక్టులఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఘటన బాధాకరం : టిడిపి

ప్రజాశక్తి - బనగానపల్లె

నెల్లూరు జిల్లా కందుకూరులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి వచ్చిన ఎనిమిది మంది అమరులు కావడం బాధాకరమని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యలు తెలిపారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు కందుకూరులో మృతి చెందిన వారికి శాంతి చేకూరాలని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు రాయలసీమ సలాం, అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** నెల్లూరు జిల్లా కందుకూరులో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఎనిమిది మంది దుర్మరణం చెందడం విషాదకరమనినేతలు వంగాల శివరామి రెడ్డి, సాయి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషాలు అన్నారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు దుర్ఘటనలో మృతి చెందిన పార్టీ కార్యకర్తలకు స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి సంతాపం ప్రకటించారు.

డంపుయార్డు ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని దేవనూరు మజరా గ్రామం సున్నంపల్లెకు 50 అడుగుల దూరంలో బ్రిడ్జి పక్కన అధికారులు ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డ్‌ను ఊరికి దూరంగా ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, ఓబులేసు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, వి.నాగరాజు, వి.మద్దిలేటిలు మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో డంపు యార్డ్ ఏర్పాటు చేయాలని, ఎక్కడపడితే అక్కడ గ్రామానికి దగ్గరగా పరంపోగులు ఉన్నాయని అధికారులు చేతులు దులుపుకొని కాలుష్యాన్ని ప్రజల పైన, ఇళ్ల మధ్య, పొలాల్లో వదిలే ప్రయత్నం చేస్తున్నారని, తక్షణమే ఆ ప్రయత్నం మానుకోవాలన్నారు. సున్నంపల్లి కుందూనది దగ్గర, బ్రిడ్జి పక్కల గ్రామస్తులు పెళ్లిళ్ళ, శుభకార్యాలు జరిగితే అక్కడ సాంప్రదాయపరంగా అక్కడ భోంచేసుకుని గ్రామంలోకి పెళ్లికూతురు, పెళ్లి కొడుకును తీసుకొని సందడి చేసుకుంటూ వెళ్తారని తెలిపారు. అలాంటి సాంప్రదాయం గల చోట డంప్‌యార్డు ఏర్పాటు చేయడం తగదన్నారు. తక్షణమే అక్కడి నుంచి దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామస్తులు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వి.నాగేంద్రుడు, యూసుఫ్, పుల్లయ్య, మహేష్, దేవయ్య, రైతులు వి వెంకటస్వామి, విశ్వేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

హ్యాండ్ బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ఆళ్లగడ్డ : పట్టణంలోని సోముల రమణారెడ్డి క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం నంద్యాల జిల్లా హ్యాండ్ బాల్ బాలికల జట్టుకు అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏ.వి రామసుబ్రమణ్యం, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి కృష్ణవేణి ప్రియ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అకాడమీ కార్యదర్శి డాక్టర్ రామసుబ్రహ్మణ్యం, కోచ్ సుబ్బరాయుడులు మాట్లాడుతూ సోముల రమణారెడ్డి అకాడమీలో ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నంద్యాల జిల్లా హ్యాండ్ బాల్ బాలికల జట్టుకు శిక్షణ శిబిరం జరిగిందని, ఈ జట్టు ఈనెల 30, 31వ తేదీలలో అనంతపురం జిల్లా కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించాలని క్రీడాకారులకు సూచించారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

- ఖాళీగా ఉన్న కొన్ని గ్రామాలలో ఆసక్తి చూపని వైనం

పాములపాడు : పాములపాడు మండలంలో 5 వాలంటరీ పోస్టులకు ఎంపీడీవో సుమిత్రమ్మ, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ, ఏవో కర్ణ సాగర్‌లు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జూటూరు, ఎర్ర గూడూరు గ్రామాల పోస్టులకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదు. వేంపెంట గ్రామంలో రెండు పోస్టులకు గాను ఒక పోస్టుకే దరఖాస్తు చేసుకున్నారు. మద్దూరు గ్రామంలో ఒక పోస్టుకు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. వేంపెంటలో రెండు పోస్టులకు ఒక్కరు, మద్దూర్‌లో ఒక పోస్ట్ కు ఇద్దరు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. **పగిడ్యాల :** పగిడ్యాలలోని ఎంపిడిఒ కార్యాలయంలో మూడు గ్రామాల వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం త్రిసభ్య కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తహశీల్దార్ భారతి, ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒఆర్‌డి పుల్లయ్య మాట్లాడారు. ఇంటర్వ్యూలకు 8 మంది గాను 5 మంది హాజరైనట్లు తెలిపారు.

సచివాలయాలను డిప్యూటీ సిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం, చిత్రేనిపల్లి, ఆర్ నాగులవరం సచివాలయాలతో పాటు రుద్రవరం ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ రాజ్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, పలు రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి ఆరోగ్య యోజన, నాడు నేడు పనులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు సక్రమంగా హాజరు కావాలని, రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో మధుసూదన రెడ్డి, పిఆర్ఏఈ వెంకటరాముడు, వీఆర్వో ఓబయ్య, కార్యదర్శి జయరామిరెడ్డి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కోళ్ల పెంపకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా మండలంలోని లబ్ధిదారులకు పెరటి కోళ్ల పెంపకం కింద మంజూరైన 50 యూనిట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, వైయస్సార్ క్రాంతి పథకం ఏపీఎం రామశేఖర్ రెడ్డి, సిసి శ్రీనివాసులు, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మద్యం షాపులను అధికారులు తనిఖీ

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ మద్యం షాపులను, బార్ అండ్ రెస్టారెంట్‌లను గురువారం జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఏం అస్లాం బేగ్, కానిస్టేబుల్ భక్త శేషురెడ్డి, రవిలు తనిఖీ చేశారు. మద్యం శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో ప్రభుత్వ నిబంధన మేరకు అమ్మకాలు చేపట్టాలని సూచించారు.

సాంప్రదాయ దుస్తులతోనే గర్భాలయ ప్రవేశం : ఇఒ

మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో జనవరి 1 నుండి సాంప్రదాయ దుస్తులతోనే గర్భాలయ ప్రవేశం అనుమతి ఇవ్వనున్నట్లుగా ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డిలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాలలో భక్తుల సౌకర్యం కోసం సాంప్రదాయ దుస్తుల దారణ అనే విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

నంద్యాల : కేంద్రంలోని మోడీ ఆదేశానుసారం రాష్ట్రంలో ఇండ్లకు ఇస్తున్న కరెంటుకు స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ కమిటీ జిల్లా కన్వీనర్ మస్తాన్‌వలి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపేంత వరకు పోరాడాలని కోరారు.

శాసన మడలిలో ఉపాధ్యాయ వాణి వినిపిస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఛామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి

బనగానపల్లె : శాసన మడలిలో ఉపాధ్యాయ వాణి వినిపిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఛామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఛామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ సమావేశం ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవ స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాంబశివుడు, నాయకులు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను సిఐ పరిశీలన

రుద్రవరం : రుద్రవరం సమీపంలో వెలసిన శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి పూజలకు బందోబస్తు ఏర్పాట్లను సిఐ చంద్రబాబు నాయుడు, ఎస్సై నిరంజన్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. ముందుగా వారు స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, ప్రధాన అర్చకుడు గోపి శర్మ, శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బండి ఆత్మకూర్ : మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కొన్న వెంటనే మసీదులు ఇవ్వాలని, ధరల పట్టిక బోర్డులు పెట్టాలన్నారు. ప్రతిరోజు ధరలను పట్టికలో రాయాలన్నారు. కార్యక్రమంలో మండల డీలర్లు, విఏఏలు అశోక్ కుమార్ రెడ్డి, అయేషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన : టిడిపి

పాణ్యం : రాష్ట్రములో అరాచక పాలన తారాస్థాయికి చేరిందని టిడిపి పాణ్యం మండల నాయకులు ఆరోపించారు. టిడిపి అధిష్టానం పిలుపు మేరకు గురువారం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు లాయర్ బాబు, ఎంపిటిసి రంగ రమేష్ మాట్లాడుతూ ఈ అరాచక పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రమణ మూర్తి, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, గుజ్జుల సుబ్బయ్య, వెంకటాద్రి, ఖాదర్ బాషా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మాహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి నందికొట్కూరు వారి కోర్టులో
ఓ.యస్.నెం.209/2022
డి.సావిత్రమ్మ
భర్త డి.సూర్యనారాయణ
సుబ్బరావు పేట, నందికొట్కూరు. ...వాది
వర్సెస్
టి.నారాయణ రెడ్డి
తండ్రి టి.నాగిరెడ్డి
ఫర్టిలైజర్ వ్యాపారం,
ఇంటి నెం. 16-46-1ఎ,
సుబ్బారావు పేట,
నందికొట్కూరు, నంద్యాల జిల్లా. ...ప్రతివాది
వాది తన యొక్క ప్రామిసరి నోటు బాకీ నిమిత్తం పై కోర్టులో దావా వేసియున్నారు. ఇందుకు ప్రతివాది ప్రత్యేక్షంగా గాని లేదా పరోక్షముగా గాని తేది. 04-01-2023న పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో కోర్టువారు తగు ఉత్తర్వులు జారి చేయగలరు.
వాయిదా తేది: 04-01-2023
ఇట్లు
వి.యన్.సత్యనారాయణ,
వాదిపరం అడ్వకేట్,
నందికొట్కూరు.
సెల్ నెం.9440205009